క్లుప్తంగా

సుధాకర్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగంలో పరిశోధకుడు గోస్కు ల సుధాకర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. పర్‌ఫార్మెన్స్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ఇన్ తెలంగాణ స్టేట్ ఏకేస్ స్టడీ ఆఫ్ వరంగల్ (రూరల్) డిస్ట్రిక్ట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సుధాకర్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచా ర్య కె.రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ఆచార్యులు జి.వీరన్న పర్యవేక్షణలో సుధాకర్ తన పీహెచ్‌డీ పూర్తి చేశారు.

నియామకం



నర్సింహస్వామి, నాగేశ్వర్‌రావు, నర్సింహరాములు

వరంగల్ లీగల్ : కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం (ఐఎన్‌టీయూసీ) అనుబంధ న్యాయవిభాగం రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా సీనియర్ న్యాయవాది పోరండ్ల నర్సింహారాములును నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు స్వామినాథ్ జైస్వాల్‌జీ, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బుద్ధారం మురహరి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సూరం నర్సింహస్వామి, కొంతం నాగేశ్వర్‌రావులను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్లు మరమ్మతు చేస్తున్నందున వడ్డేపల్లి సబ్‌స్టేషన్, మడికొండ టెక్స్‌టైల్ పార్కు, టేకులగూడెం, సోమిడి సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే విష్ణుపురి, కాజీపేట పోలీసుస్టేషన్, రహమత్‌నగర్, జూబ్లీ మా ర్కె ట్, వెంకటాద్రినగర్, సోమిడి, కాజీపేట మెయిన్ రోడ్డు, రైల్వే స్టేషన్, డీమార్ట్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో శ్వేతార్కుడు



కాజీపేట : స్థానిక స్వయంభు శ్వేతార్క మూల గణపతి దివ్యక్షేత్రంలో శుక్రవారం రాత్రి ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.

వనదేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే



హన్మకొండ చౌరస్తా: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి–నీలిమారెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా కలిసి శుక్రవారం మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ సాంప్రదాయ పద్ధతిలో పూజారులు స్వాగతం పలికారు.

ఏటూరు జ్యోతికి నివాళి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇటీవలనే మృతి చెందిన ప్రొఫెసర్ ఏటూరుజ్యోతికి శుక్రవారం క్యాంపస్‌లోని గ్రంథాలయంలో జ్యోతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయం మెంబర్ ఇన్‌చార్జ్ సీజే శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులా ప్రకృతి వనం

- ఆహ్లాదానికి బదులు అనారోగ్యానికి కేరాఫ్
- ఇబ్బందులు పడుతున్న నగరవాసులు

కాజీపేట అర్బన్ : పర్యావరణ పరిరక్షణకు పచ్చదనానికి ప్రకృతి పలకరింపును అందజేసేందుకు హంటర్‌రోడ్డు న్యూశాయంపేటలోని విద్యుత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనం డంపింగ్ యార్డును తలపిస్తోంది. ప్రకృతివనం ఎదురుగా చెత్తాచెదారం, ఓ వైపు కొట్టి పారేసిన చెట్టు కొమ్మలు ఇది ప్రకృతి వనమా లేక డంపింగ్ వనమా అనే ప్రశ్నను నగరవాసులు వేసుకుంటున్నారు. ప్రకృతి వనం మీదుగా ప్రయాణం అంటేనే ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.



ప్రకృతివనంలో పడేసిన వ్యర్థాలు



గేటు ఎదుట చెట్ల కొమ్మలు నరికేసి పడేసిన దృశ్యం

ఆహ్లాదానికి బదులుగా అనారోగ్యానికి కేరాఫ్

నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందజేసేందుకు గ్రీన్ ల్యాండ్స్‌లో పట్టణ ప్రకృతి వనాన్ని నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలను నాటి అడవిని తలపించేందుకు మియావాకీ ఫారెస్ట్ నమునాతో పట్టణ ప్రకృతి వనాన్ని నిర్మించారు. రోడ్డు ప్రక్కనే ఏర్పాటు చేసిన ప్రకృతి వనంతో నగర ప్రజలకు ఆహ్లాదం అందుతుందనుకుంటే అనారోగ్యానికి కేరాఫ్‌గా నిలుస్తోంది. తక్షణమే అధికారులు ప్రకృతి వనాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని, చెత్తాచెదారం పారేసే వారిపై చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు వేడుకుంటున్నారు.

కొనసాగుతున్న భూ సర్వే

- రికార్డుల ఆధారంగా భూముల పరిశీలన

ఖిలా వరంగల్ : రైతుభరోసా పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు వ్యవసాయ, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో యోగ్యతలేని భూముల గుర్తింపు కొనసాగుతోంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా సర్వే మరింత వేగవంతమైంది. శుక్రవారం రెండో రోజుకు వ్యవసాయేతర భూముల గుర్తింపు చేరింది. ప్రభుత్వం చేపట్టిన పథకాల్లో ఒకటైన రైతు భరోసా ఎంపిక పారదర్శకంగా సాగుతుంది. ఈనేపథ్యంలో శుక్రవారం ఉదయం ఖిలావరంగల్ మండలం ఉర్సు, కరీమాబాద్, రంగశాయిపేట, తిమ్మాపురం, బొల్లికుంట, స్తంభంపెల్లి, గాడిపెల్లి, అల్లీపురం, ఖిలావరంగల్‌లో సర్వే అధికారులు పర్యటించారు. రికార్డుల ఆధారంగా వ్యవసాయేతర భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వర్ధన్నపేట



ఉర్సు కరీమాబాద్ ఏరియాలో వ్యవసాయేతర భూములను పరిశీలిస్తున్న డీటీ రమేశ్, ఏఈఓ

నర్సింగం, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు మాట్లాడారు. రికార్డు ఆధారంగా యోగ్యత, యోగ్యతలేని భూములను పరిశీలించి రైతు భరోసా పోర్టల్ నమోదు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఏఈఓ చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

చట్టబద్ధంగా వ్యవహరిస్తాం

- న్యాయవాదులకు సీపీ హామీ

వరంగల్ లీగల్ : కోర్టు ఆదేశాలను అమలుపర్చడంలో చట్టబద్ధంగా వ్యవహరిస్తామని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ఉభయ జిల్లాల బార్ అసోసియేషన్ల ప్రతినిధులకు, న్యాయవాదులకు హామీ ఇచ్చారు. శుక్రవారం జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, మాతంగి రమేష్‌బాబు ఆధ్వర్యంలో న్యాయవాదులు సీపీ కార్యాలయంలో సీపీని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ మోహన్ ఉమ్మడి కుటుంబ ఆస్తి విషయంలో గతంలోనే సీనియర్ సివిల్ కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ మంజూరు చేయడం జరి గింది. అయినప్పటికీ ప్రత్యర్థులు వారి స్థలంలో అక్రమంగా చొరబడి దౌర్జన్యం చేయగా ఆనంద్‌మోహన్ కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించని కారణంగా హైకోర్టును ఆశ్రయించారు. వరంగల్ సీనియర్ సివిల్ కోర్టు జారీ చేసిన ఇంజక్షన్ ఆర్డర్‌ను అమలు పర్చాలని మిల్స్‌కాలనీ సీఐకి ఆదేశాలు జారీ చే యడం జరిగింది. ఇదిలా



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

ఉండగా హైకోర్టు ఆదేశాల్లో ప్రతివాదిగా ఉన్న వ్యక్తి ద్వారా ఫిర్యాదు స్వీకరించిన మిల్స్‌కాలనీ పోలీసులు ఆనంద్‌మోహన్, ఇతర కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు. మరో న్యాయవాది ఆగ్రోజు సోమాచారిది కూడా కోర్టు ఇచ్చిన ఆదేశాలను పోలీసులు అమలుపర్చకపోవడాన్ని సీపీ దృష్టికి తీసుకెళ్లారు. సీపీ కలిసిన వా రిలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లడే రమేష్, ఉపాధ్యక్షులు రవీందర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు గుడిమళ్ల రవికుమార్, నర్సింహస్వామి, శ్రీనివాస్, సురేష్, సోమాచారి, తదితరులు ఉన్నారు.

వర్గీకరణతో 58 కులాలకు ప్రయోజనం



హసన్‌పర్తి: వర్గీకరణతో ఎస్సీలోని 58 ఉప కులాలకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు పుట్ట రవి మాదిగ అన్నారు. ఈనెల 20న హన్మకొండలోని వేయిస్తంభాల ఆలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు మాదిగ డప్పు కళాకారుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో డప్పు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి రవి మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వర్గీకరణ రిజర్వేషన్ అమలు కాకుంటే కేవలం మాల ఉప కులానికే లబ్ధి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పవన్, భిక్షపతి, యుగంధర్, ఎల్లేష్, రమేష్, రవీందర్, దుర్గాప్రసాద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచంద్రారెడ్డి, కాంగ్రెస్ నేత రవీందర్ పాల్గొన్నారు.

ఒకేరోజు పెన్షన్ మంజూరు చేయాలి

- ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సారయ్య

వరంగల్ : తెలంగాణ మార్కెట్లలో ఉన్న 1650 మంది పెన్షనర్లందరికీ ఒకే రోజు ఒకే చెక్కుతో పెన్షన్ పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెట్ కమిటీ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగపురి సారయ్య మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, అడిషనల్ డైరెక్టర్ రవికుమార్‌లను కోరారు. శుక్రవారం ఏనుమాముల మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయంలో జరిగిన రివ్యూ మీటింగ్‌కు హాజరైన మార్కెటింగ్‌శాఖ అధికారులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానించి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మార్కెట్ కమిటీల్లో ఉన్న



మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయికి వినతిపత్రం అందజేస్తున్న సారయ్య

(2,650)పెన్షనర్లకు గుంటూరు హెడ్ ఆఫీసు నుంచి ఒకే చెక్కుద్వారా పెన్షన్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించి అమలు చేస్తామని హా మీ ఇచ్చారు. కార్యక్రమంలో జేడీఎం శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంఓ సురేఖ, మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌ఈఈయూ -327ను బలోపేతం చేయాలి

- యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులు సంఘటితంగా ఉండాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌ఈఈయూ) -327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ పిలుపునిచ్చారు. ఇటీవల ఎన్నికైన యూనియన్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్ ఆత్మీయ అభినందన సమావేశాన్ని హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సంఘటితంగా ఉంటేనే హక్కుల సాధన, సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. నూతనంగా



ఐలేశ్, శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న శ్రీధర్, నేతలు

ఎన్నికైన సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్‌ను శ్రీధర్‌తోపాటు ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, నాయకులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో యూనియన్ కార్యదర్శి శ్రీనివాస్, ఎస్పీడీఎస్ఎల్ కంపెనీ అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి భూపాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కదంతొక్కిన కళాకారులు



పాటలు పాడుతున్న కళాకారులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ నిరుద్యోగ మేళా 'ఆటల పల్లకి' కళాకారులు ఆటాపాటలతో కదం తొక్కారు. మలిదశ ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతులను చేయడంలో కళాకారుల పాత్రను గుర్తు చేసుకుంటూ గాయకులు పాడిన పాటలు యువతలో నూతన ఉత్తేజాన్ని నింపాయి. కాంగ్రెస్ అనుబంధ కళాకారుల సంఘం బా ధ్యుడు రఘు, ప్రజా గాయకుడు కిశోర్ సారథ్యంలో కొనసాగిన కార్యక్రమానికి రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి కళాకారులు హాజరై పాటలు పాడుతూ చిందేశారు. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి హాజరై ప్రజలను చైతన్యపర్చడంలో కళాకారుల పాత్ర మరిచి పోలేనిదని అన్నారు. కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. తెలంగాణ జానపద కళాకారుల సంఘం బాధ్యులు సుధాకర్, రమాదేవీ, సమ్మన్న, వినోద, రమణా చారి, ఎల్లయ్య, సతీష్, సదానందం పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



రామన్నపేట : ఈనెల 25న సంగారెడ్డిలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 4వ తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అరూరి కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని 29వ డివిజన్ రఘునాథ్‌కాలనీలో రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నగర శా ఖ కార్యదర్శులు కొల్లోజు రమేష్, కేకే రమేష్, శ్రీనివాస్, శివ, వీరస్వామి, గాలయ్య, రవి, బాబు, కుమారస్వామి, ఐలయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భవన స్థలంపై కార్మికులకు న్యాయం చేయాలి

వరంగల్: అజంజాహి కార్మికులకు చెందిన కార్మికుల భవనం కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు కార్మికులకు న్యాయం చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశానికి వచ్చిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి భవనం కూల్చివేతపై ఫిర్యాదు చేశారు.

దళితుల అభివృద్ధికి నిధులు కేటాయించండి

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రాష్ట్రంలోని దళి తుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ సీనియర్ నాయకుడు డాక్టర్ రామకృష్ణ శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి రాందాస్ అథవాలే ను కలిసి కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను అందిస్తే మరింత అభివృద్ధి చేయచ్చని అన్నారు.

జనావాసాల్లో టవర్ నిర్మించొద్దు

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు గుట్ట వద్ద సెల్ టవర్ నిర్మించొద్దంటూ శుక్రవారం సాయంత్రం టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. జనావాసాల్లో టవర్ నిర్మిస్తే రేడియేషన్ సమస్యలు ఏర్పడి, అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. తమ ప్రాంతంలో టవర్ నిర్మించొద్దని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలిసి పోలీసులు సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకుంటున్న స్థలం వద్ద చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు.

2 రోజులు తాగునీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్ : వరంగల్ ప్రతాపరుద్ర దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌లో పైపులైన్ల లీకేజీల మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ రామోజు శ్రీనివాస్ తెలిపారు. నేడు, రేపు (శని ఆదివారాల్లో) నీటి సరఫరా జరగదని పేర్కొన్నారు.

19న ఏకశిల కరోకే క్లబ్ రెండో వార్షికోత్సవం

నయీంనగర్ : ఈ నెల 19న ఏకశిల కరోకే క్లబ్ రెండో వార్షికోత్సవాన్ని నయీంనగర్ వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్ కూజా, రాజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. సంగీతాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆత్మగౌరవ ధిక్కార పతాక రోహిత్ వేముల

హన్మకొండ: ఆత్మ గౌరవ ధిక్కార పతాక రోహిత్ వేముల అని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. శుక్రవారం హనుమకొండలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో రోహిత్ వేముల 9వ వర్ధంతిని జరుపుకున్నారు. ముందుగా రోహిత్ వే ముల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

హన్మకొండ చౌరస్తా: యువతకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి యువత రావాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు.మల్లన్న జన్మదినం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఆఫీసులో ఆయనను మాజీ కార్పొరేటర్ డిన్న కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

డ్రైవర్లు వాహనాలను ఏకాగ్రతతో నడపాలి

ఖిలావరంగల్ : వాహనాలు నడిపే సమయంలో రోడ్డుపై దృష్టి సారించి ఏకాగ్రతతో నడపాలని ఎంవీఐలు జైపాల్‌రెడ్డి, శోభన్‌బాబు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని వరంగల్ జిల్లా లారీ అసోసియేషన్ ప్రాంగణంలో వరంగల్ ఆర్టీఏ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై హెవీ వెహికిల్స్ వాహనాల డ్రైవర్లు, ఓనర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల్లో పరిమితిని మించి ప్రయాణికులు, ఓవర్‌లోడును అనుమతించవద్దని సూచించారు. అతివేగం ప్రమాదకరమని, మద్యం సేవించి, సెల్ ఫోనులో మాట్లాడుతూ వాహనాలను నడుపరాదన్నారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల భూపాల్, కార్యవర్గ సభ్యులు, లారీడ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) హనుమకొండ జిల్లా శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం జనతా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ కంచర్ల సుధీర్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు కిరణ్‌కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.రవీందర్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: సామాజిక న్యాయవేదిక వరంగల్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాజం, రాష్ట్ర సలహా దా రుడు భూపాల్‌రావు, వ్యవస్థాపక అధ్యక్షుడు సాంబయ్య యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం సలహా దారుడు వేం నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

లోవోల్టేజీ సమస్య నివారణకు చర్యలు

హసన్‌పర్తి : 55వ డివిజన్‌లో విద్యుత్ లోవోల్టేజీ సమస్య నివారణకు చర్యలు తీసుకున్నట్లు కార్పొరేటర్ జక్కుల రజిత అన్నారు. 55వ డివిజన్ భీమారంలోని యాదవనగర్‌లో కొత్తగా ఏర్పాటు విద్యుత్ లైన్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు.

రెవెన్యూ రికవరీ చట్టం లోపభూయిష్టం

- సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్

ఖిలా వరంగల్: బ్రిటీష్‌కాలంలో ఏర్పాటైన ఆర్.ఆర్ (రెవెన్యూ రికవరీ) చట్టం లోప భూయిష్టమైందని, దీన్ని సవరణ చేసి ఉద్దేశపూర్వక ఎగవేత దారులు, సహకరించే అధికారులపై కేసులు నమోదు చేయాలని సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ కోరారు. శుక్రవారం శివనగర్‌లోని రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యాలయంలో సీనియర్ న్యాయవాదులు మురారిశెట్టి య శ్వంత్‌కుమార్, రాజేష్‌కుమార్ అధ్యక్షతన వినియోగదారులు లీగల్ సెల్ ప్రతినిధుల సమావేశం జరి గింది. చట్టపరంగా త్వరితగతిన, కఠినమైన చర్యలు, ప్రజాధన దుర్వినియోగ బాధ్యుల నుంచి ప్రభుత్వం రికవరీ చేసే విధానాల్లో చేయాల్సిన మార్పులు చేర్పులపై చర్చించారు. అనంతరం వరంగల్ జిల్లాలోని 37 రైసు మిల్లుల వివరాలను ఆయన న్యాయవాదులకు అందజేశారు. సమావేశంలో న్యాయవాదులు ఆనందరావు, భిక్షపతి, అనిల్‌కుమార్, రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రూ. 6.50 లక్షల గుట్కా నిల్వల పట్టివేత

రామన్నపేట : వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో పక్కా సమాచారం మేరకు కాకతీయ థియేటర్ సమీపంలో శుక్రవారం ముఖేష్ అనే వ్యక్తి నిల్వ చేసిన రూ 6.50 లక్షల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. గుట్కా ప్యాకెట్లు నిల్వ చేసిన టాటా ఏస్ వాహనంతో పాటు ఓ మినీ వాహనాన్ని సీజ్ చేసినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

కాజీపేట: తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గంజాయి విక్రయాలు సాగిస్తున్న యువకుడిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న నకిరకంటి పవన్ బంధం చెరువు సమీపంలో గంజాయి అమ్ముతున్నట్లుగా అందిన పక్కా సమాచారం మేరకు దాడి చేసి 280 గ్రాముల గంజాయితో పట్టుకున్నట్లు చెప్పారు. ప్రత్యక్ష సాక్షుల ఆధ్వర్యంలో గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

హసన్‌పర్తి : అక్రమంగా తరలివెళ్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. శుక్రవారం నాగారంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ టాటాఏస్ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 20 క్వింటాళ్ల బియ్యంను గుర్తించారు. బియ్యం తీసుకెళ్తున్న హనుమకొండ వడ్డేపల్లికి చెందిన టాటా ఏస్ డ్రైవర్ కట్ల మనోహర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ బియ్యాన్ని వివిధ ప్రాంతాల నుంచి రూ.10లకు సేకరించి పక్క రాష్ట్రం రూ.25 లకు అమ్ముతున్నారని పోలీసులు పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కేయూ క్యాంపస్ : కేయూ వి ద్యా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా దూరవి ద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య రాంచంద్రం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సిహెచ్.రణధీర్‌రెడ్డి నుంచి రాంచంద్రం బాధ్యతలు స్వీకరించారు. రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, విద్యాకళాశాల డీన్ ఆచార్య రాంనాథ్‌కిషన్, ఎడ్‌సెట్ కన్వీనర్ ఆచార్య వెంకట్రామ్‌రెడ్డి అభినందించారు.



రాంచంద్రంను అభినందిస్తున్న రిజిస్ట్రార్, తదితరులు

బడి బయట పిల్లల గుర్తింపునకు సర్వే

హసన్‌పర్తి : బడి బయట పిల్లల గుర్తింపునకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రభుత్వం చేపడుతున్న సర్వేలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో సీఆర్పీలు బడి బయట ఉన్న పిల్లల వివరాలు సేకరణలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు ఇంటింటికి వెళ్లి పిల్లల వివరాలు సేకరిస్తున్నారు. పాఠశాలకు నెల రోజుల పాటు రెగ్యూలర్‌గా హాజరుకాని విద్యార్థులను డ్రాప్‌అవుట్‌గా గుర్తించి వారి వివరాలు నమోదు చేస్తున్నారు. ఆ వివరాలు జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు. బడీడు పిల్లలతో పనిలో కుదుర్చుకుంటే జైలుకు పంపుతామని మండల విద్యాశాఖ అధికారి రవీందర్ హెచ్చరించారు. ఇప్పటి



సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీ

వరకు 30 మంది పిల్లలను బడిబయట ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఆర్పీ నాగరాజు, స్థానికులు పాల్గొన్నారు.

చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

హన్మకొండ: ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన కలిగి ఉండాలని వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ వైస్ చైర్మన్, సలహాదారు కరుకాల అనితారెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ సుబేదారిలోని బాలికల బాలసదనంలో విద్యార్థులకు, సిబ్బందికి వినియోగదారుల హక్కుల చట్టం–2019, రక్షణ, బాధ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలను అవగాహన పరచడం అంటే సమాజాన్ని మోసాల బారి నుంచి కాపాడడమేనని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కొత్త దుస్తులు అందించారు. కార్యక్రమంలో బాలసదనం నిర్వాహకురాలు కల్యాణి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న అనితారెడ్డి

రాజరాజేశ్వరీదేవికి పుష్పార్చన

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరీ దేవాలయంలో పుష్యమాసం బహుళ చవితి శుక్రవారం అమ్మవారికి చామంతిపూలతో పుష్పార్చన నిర్వహించారు. ఆలయ అర్చకుడు యెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు, వికారాబాద్ నుంచి తీసుకొచ్చిన 365 కిలోల చామంతులతో పుష్పార్చన చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని లలిత సహస్ర నామపారాయణం, సౌందర్య లహరి పారాయణం చేశారు. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

